## క్లుప్తంగా

### నేడు డయల్ యువర్ డీఎం

సాలూరు: డయల్ యువర్ డీఎం కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు సాలూరు ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు,ప్రయాణికులు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో ఫోన్ 9959225622 నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

### ఆశ్రమ పాఠశాల సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ కనకలక్ష్మి

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సాలూరు ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ బి.కనకలక్ష్మి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల స్థితిగతుల పై ఆమె ఆరా తీశారు. పాఠశాలలో వసతులు ఎలా ఉన్నాయి? సమస్యలు వచ్చినప్పుడు ఎలా స్పందించాలి? ఎవరికి ఫిర్యాదు చేస్తున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు తరగతి గదులు చాలడం లేదని అలాగే డార్మిటరీ సరిపోవడం లేదని మెజిస్ట్రేట్‌కు తెలియజేశారు.అనంతరం బొడ్డవలస డా.బీఆర్ అంబేడ్కర్ బాలుర ఆశ్రమ పాఠశాలను ఇన్‌చార్జ్ మెజిస్ట్రేట్ సందర్శించారు. అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు.

### కేవీకేలో వ్యవసాయ విజ్ఞానం


కేవీకే సేవలను విద్యార్థులకు వివరిస్తున్న శాస్త్రవేత్త అనంత విహారి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కృషి విజ్ఞాన కేంద్రంలో వివిధ పంటల సాగులో రైతులకు కావాల్సిన వ్యవసాయ విజ్ఞానం లభిస్తుందని కురుపాం మండలం రస్తాకుంటుబాయి కృషీ విజ్ఞాన కేంద్రం (ఆచార్యా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం) విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.అనంత విహారి అన్నారు. ఈమేరకు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ పథకంలో భాగంగా 20 మంది విద్యార్థులు శుక్రవారం కేవీకేను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు కేవీకే ద్వారా అందుతున్న సేవలను వివరించారు. అలాగే కేవీకేలో ఉన్న వివిధ డెమో యూనిట్లు, వర్మీకంపోస్టు యూనిట్లు, పుట్టగొడుగుల యూనిట్, పౌల్ట్రీ షెడ్, చిరుధాన్యాలు యూనిట్‌లను చూపించారు.

### విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన


నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

సీతంపేట: విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు, ట్రూ ఆఫ్ చార్జీలు వద్దంటూ స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులు శుక్రవారం నిరసన తెలియజేశారు. ముందుగా సీపీఎం కార్యాలయం నుంచి విద్యుత్‌శాఖ ఆఫీస్‌కు ర్యాలీగా తరలివెళ్లారు. అక్కడ కొద్దిసేపు నిరసన తెలియజేశారు. అనంతరం విద్యుత్‌శాఖ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.భాస్కరరావు, పి.సాంబయ్య, జె.సుందరమ్మ, ఎ.గంగాధర్, బి.నీలయ్య, జి.మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

### పోలీసుల గౌరవ వందనం

పాలకొండ రూరల్: మండలంలోని గొట్ట మంగళాపురం గ్రామానికి చెందిన కోట్ల బుల్లిబాబు(48) ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం నాడు విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కురుపాం మండలం జరడ నుంచి నీలకంఠాపురం మధ్య గల ఘాట్‌రోడ్డులో వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురై మరణించాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి శుక్రవారం తరలించారు. గ్రామస్తుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు చేపట్టారు. పోలీసులు గాలిలో మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు.

### ముస్లిం మహిళలకు చీరల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): విశాఖపట్నంకు చెందిన మోసెస్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో యస్ సొసైటీ ఆధ్వర్యంలో కురుపాం మండల కేంద్రంలోని నిరుపేద ముస్లిం మహిళలకు చీరలు, పవిత్ర ఖురాన్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోసెస్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి సిరాజుద్దీన్ మాట్లాడుతూ పవిత్ర ఖురాన్ చదివి, అందులోని అంశాలను పాటించడం ప్రతి ముస్లిం కర్తవ్యమని చెప్పారు. రానున్న రోజుల్లో కూడా పేద ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌష్ పాల్గొన్నారు.

# డిజిటల్ లావాదేవీలపై ఆసక్తి


ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ లావాదేవీలు చేస్తున్న చిత్రం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని 60శాతం మంది ప్రజలు డిజిటల్ లావాదేవీలకే ఆసక్తి చూపిస్తున్నారు. సెల్‌ఫోన్‌లో వివిధ యాప్‌లను వినియోగిస్తూ డిజిటల్ పేమెంట్లను చేస్తున్నారు. దీంతో నగదును ముట్టుకోవాల్సిన పనిలేకుండానే వారి పనులు అయిపోతున్నాయి. యాండ్రాయిడ్ మొబైల్ ఉన్న వారిలో 90శాతంమంది డిజిటల్ వావాదేవీల వైపే మొగ్గు చూపిస్తున్నారు. పట్టణంలోని అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థలు క్యూఆర్ కోడ్‌లు పెట్టి నగదు రహిత వ్యాపారాలు చేస్తున్నాయి. కొంతమంది వ్యాపారస్తులు, సంస్థలు డిజిటల్ లావాదేవీలపై వినియోగదారులను ఆకర్షించేందుకు అనేక ఆఫర్లను సైతం పెడుతున్నాయి. భారత్‌పే, ఫోన్‌పే, పేటీఎం, భీం రీచార్జి, గూగుల్‌పేలతో పాటు కొన్ని ప్రైవేట్, ప్రభుత్వ బ్యాంకులకు సైతం యాప్‌లు ఉన్నాయి. ఆయా సంస్థలు భారీగా ఆఫర్లు ప్రకటించడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల యువత, ప్రజలు సైతం నగదు రహిత లావాదేవీలకే ఆసక్తి కనబరుస్తున్నారు.

● యూపీఐ విధానం

యుపీఐ విధానం ద్వారా దుకాణాలు, సంస్థలు, షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్ షాపింగ్‌లలో బిల్లుల చెల్లింపుతోపాటు యాప్‌ల ద్వారా కరెంటు బిల్లు, మొబైల్ రీచార్జి, డిష్ టీవీ, ఇతరులకు నగదు పంపించడం అనేక రకాలు చెల్లింపులకు బ్యాంకుల డెబిట్‌కార్డు, క్రెడిట్‌కార్డు లేకుండానే నేరుగా ఆన్‌లైన్‌లో చెల్లించే విధానం యూపీఐ ఐడీకి ఉంటుంది. ఒక వేళ దుకాణాల్లో యూపీఐ సదుపాయం లేనట్‌లైతే దుకాణ యజమాని బ్యాంకు ఖాతాలోకి నేరుగా చెల్లించే అవకాశం ఉంటుంది.



**జాగ్రత్తలు తప్పనిసరి**

డిజిటల్ లావాదేవీలు జరిపేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. నగదు రహిత లావాదేవీలు జరిపే సమయంలో మన ఓటీపీని ఎవరికీ చెప్పరాదు. మీ మెబైల్స్‌లో వచ్చే అనవసర లింక్‌లను ఓపెన్ చేయరాదు. అలా చేయడం వల్ల మీ వ్యక్తిగత సమాచారం ఇతరులకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లో ఏటీఎం కార్డు, పిన్ నంబర్‌లను ఇతరులకు తెలియజేయరాదు. ఆన్‌లైన్ వ్యాపార సంస్థల నుంచి ఫోన్ వచ్చేటప్పుడు వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టిపరిస్థితుల్లోను తెలపరాదు.

– జీడీ బాబు, సైబర్‌సెల్ ఇన్‌చార్జి సీఐ, పార్వతీపురం

## పాడి రైతులకు పాల రేటు పెంచాలి


పణుకుపేట జంక్షన్‌లో రాష్ట్ర రహదారిపై నిర్వహించిన రాస్తారోకోలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

సీతానగరం: పాల ధరను పెంచాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కాశీపేట బల్క్ సెంటర్ వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పాడి రైతులు శుక్రవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ విశాఖ డైరీకి పాడి రైతులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పాలు సరఫరా చేస్తుంటే గిట్టుబాటు ధర రావడం లేదని, గతంలో ఉన్న ధర కన్నా ఐదు రూపాయలు తక్కువగా ఇస్తున్నారన్నారు. విశాఖ డైరీ చైర్మన్ రైతులతో సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయించడం సరైన పద్ధతి కాదన్నారు. పెరుగుతున్న దాణా ఖర్చులతో పోలిస్తే ప్రస్తుత ధర గిట్టుబాటు కావడం లేదని, కావున తక్షణమే ప్రస్తుత ధర్‌పై లీటరుకు పది రూపాయలు చొప్పున పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, మండల అధ్యక్షుడు బి.అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, సీఐటీయూ నాయకులు జి.వెంకటరమణ, పాడి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి, పాడి రైతులు తేలు సూర్యనారాయణ, ధనుంజయ నాయుడు, పి విశ్వనాథం, టి బలరాంతో పాటు అంటిపేట, కాశాయపేట, రెడ్డి వానివలస పాడి రైతులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతల నిర్మాణం వేగవంతం చేయాలి


ఇంకుడు గుంత నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ ఉడమల విజయలక్ష్మి

సీతానగరం: గ్రామాల్లో నిర్మిస్తున్న ఇంకుడు గుంతల పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని గండిపేట, కోటశేఖరపురం గ్రామాల్లో ఇంకుడుగుంతల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఇంకుడు గుంతలు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించామన్నారు. నిర్వాహకులు ఈ పనులను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామపెద్దలు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ఆరోపణలపై డ్వామా పీడీ విచారణ


మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

గరుగుబిల్లి:

గరుగుబిల్లి ఎంపీడీఓపై వచ్చిన ఆరోపణలు రుజువైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ పైడితల్లిపై వచ్చిన ఆరోపణలపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ముందస్తుగా సమాచారం అందించినప్పటికీ విచారణ సమయంలో ఎంపీడీఓ లేకపోగా, ఆ విషయాన్ని దిగువస్థాయి సిబ్బందికి తెలియపరచకపోవడంతో పీడీ అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికలో మరుగుదొడ్ల నిర్మాణంపై, జనరల్ ఫండ్ వినియోగం, బోరు మెకానిక్ నియామకం, వాహనాల అద్దె చెల్లింపులలో పలు అక్రమాలకు పాల్పడినట్లు ఎంపీడీఓపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై విచారణ నిర్వహించేందుకు వచ్చిన సమయంలో ఎంపీడీఓ అందుబాటులో లేకపోవడం బాధ్యతా రాహిత్యమే అని అన్నారు. సిబ్బంది రవి, రామచంద్రప్రసాద్ నుంచి కొంతమేర సమాచారాన్ని తీసుకొని మండల పరిషత్‌కు సంబంధించిన రికార్డులను స్వాధీనం పరుచుకున్నారు.

# స్మార్ట్‌మీటర్ రద్దు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు
● విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన



జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్: పెరిగిన ట్రూ అప్ విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ప్రజలపై భారం పెంచే స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల విధానంలో విద్యుత్ చార్జీల పెంపుదల విధానాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం పార్వతీపురంలోని జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఈఈ కె.గోపాలరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యుత్ విధానాలను టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అనుసరించబోదని ఎన్నికల ముందు, అనంతరం చంద్రబాబు ప్రకటించారని, గతంలో విద్యుత్ చార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ చార్జీల (ఇందనపు సర్దుబాటు) పేరుతో గడిచిన రెండేళ్ల నుంచి నడుస్తున్న రూ.20వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడాన్ని తీవ్రంగా సీపీఎం ఖండిస్తోందని, ఈ విధానాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. గడిచిన ఏప్రిల్ నుంచి ట్రూ అప్ చార్జీల పేరుతో నెలకు ఆరువందల బిల్లు ఉన్న వారికి వెయ్యి రూపాయలు, పన్నెండు వందలు ఉన్నవారికి మూడు వేలు, ఆపై ఉన్నవారికి రూ.ఆరువేలు పెరిగిన బిల్లులు వస్తున్నాయని, 'గతంలో వ్యతిరేకించి ఇప్పుడు ఎలా అమలు చేస్తున్నారని ప్రశ్నించారు.

**విద్యుత్ చార్జీలు తగ్గించాలి**

అలాగే గతంలో స్మార్ట్ మీటర్లలను వ్యతిరేకించిన తెలుగుదేశం ప్రభుత్వం, వారి కూటమి అదే కంపెనీలతో ఒప్పందం తెరుచుకుని స్మార్ట్ మీటర్లను విశాఖ, శ్రీకాకుళం లాంటి నగరాల్లో అమలు చేస్తోందని, ప్రస్తుత ఫోన్ రీచార్జి లాగా ముందుగా బిల్లులు చెల్లించే ఒత్తిడి పెరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన నిర్ణయం, మోపిన ఈ ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించుకుంటూ రెగ్యులేటరీ కమిషన్‌కు రాష్ట ప్రభుత్వం తెలియజేయాలని, అలాగే ప్రజలు, రైతుల పైన భారం మోపే స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేసి, విద్యుత్ చార్జీలు కూడా తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.వెంకటరమణ, బంటు దాసు, బి.సూరిబాబు, పాకల సన్యాసిరావు, మాన్యం గౌరి, చొక్కా చంద్రబాబు, వెంకటమ్మ, గౌరమ్మ, బలరాం, ప్రభ, పి.రాజశేఖర్, బలరాం, శివుని నాయుడు, శంకరావు తదితరులు పాల్గొన్నారు.


సాలూరు: మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ఎన్‌వైనాయుడు

**సాలూరులో ఆందోళన**

సాలూరు: ఇంధన సర్దుబాటుపేరుతో విద్యుత్ చార్జీలను పెంచి, ఆ భారాన్ని ప్రజలపై మోపవద్దని సీపీఎం నాయకుడు ఎన్‌వైనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలను ప్రభుత్వం అదుపుచేయలేక ప్రజలు దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు కరెంట్ బిల్లుల పెంపుతో, పేద, మధ్యతరగతి ప్రజలు మరింత ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే చార్జీల పెంపు నిర్ణయాన్ని మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈశ్వరరావు, శ్రీను, గణేష్ పాల్గొన్నారు.

## గ్రంథాలయం ముందే మద్యాలయాలు..!

● లైబ్రరీ ఎదురుగా రెండు వైన్ షాపుల ఏర్పాటు
● వ్యతిరేకిస్తున్న స్థానిక ప్రజలు
● మంత్రి స్పందించాలని డిమాండ్


పాచిపెంటలో గ్రంథాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన రెండు మద్యం షాపులు

పాచిపెంట: పిల్లల బంగారు భవిష్యత్‌కు అవసరమైన విజ్ఞానాన్ని పెంపొందించుకునే గ్రంథాలయం ముందు మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడమా? అంటూ మండల కేంద్రంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గ్రంథాలయం ఉంది. అక్కడ వందలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత పుస్తక పఠనం చేస్తూ జ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు. ఈ గ్రంథాలయంలో చదువుకుని ప్రభుత్వ కొలువులు సంపాదించిన యువతీయువకులు ఎందరో ఉన్నారు. ఇంత ప్రాశస్త్యం కలిగిన ఈ గ్రంథాలయం ముందు రెండు మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక ప్రజలు, నిరుద్యోగ యువత, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యంత నిశ్శబ్దంగా ఉండాల్సిన గ్రంథాలయం ముందు మందుబాబులు తాగి చేసే గొడవల వల్ల చదువుకునే వారి ఏకాగ్రత దెబ్బతినే ప్రమాదముందని వాపోతున్నారు.

**నాడు వద్దన్న మంత్రి నేడు ఏమంటారు?**

ఇటీవల జరిగిన మండల సర్వసభ్యసమావేశంలో ఇదే విషయంపై ఎంపీటీసీలు, సీపీఎం నాయకులు రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమం, గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి గ్రంథాలయం ముందు మద్యం దుకాణం ఉంచరాదని నిర్ణయించగా మంత్రి ప్రతిపాదన మేరకు ఎంపీపీ బద్నాన ప్రమీల అధ్యక్షతన తీర్మానం చేసి ఎక్సైజ్ అధికారులకు పంపించారు.కాగా ఇటీవల జరిగిన మద్యం లాటరీలో రెండు దుకాణాలు పాచిపెంట మండల కేంద్రానికి కేటాయించారు. ఈ రెండు దుకాణాలు గ్రంథాలయం ఎదురుగా పక్కపక్కనే ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు ఆ షాపుల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు. మంత్రి సంధ్యారాణి చొరవ తీసుకుని, ఈ దుకాణాలను గ్రంథాలయానికి దూరంగా ఏర్పాటుచేసుకునేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు. అయితే ప్రజల ఆకాంక్ష మేరకు ఆరెండు దుకాణాలును వేరే చోటకు తరలించేలా మంత్రి సంధ్యారాణి చర్యలు తీసుకుంటారా? లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

## మురుగునీటిలో ఆయిల్‌బాల్స్


పెదపెంకి గ్రామంలో ఆయిల్‌బాల్స్ ఏర్పాటుచేస్తున్న వైద్యశాఖ

బలిజిపేట: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని పెదపెంకి గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో మురుగునీటిలో ఆయిల్ బాల్స్ (వేస్ట్ మేనేజ్‌మెంట్) ఏర్పాటు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మురుగునీటిలో ఉండే లార్వాను నిర్మూలించేందుకు, లార్వా విజృంభించకుండా ఉండేందుకు వాటిని ఏర్పాటుచేస్తామని వైద్యాధికారిణి తెలిపారు. కొన్ని రసాయనాల మిశ్రమాన్ని ఈ విధంగా తయారుచేసి వాటిని గోనె సంచుల్లో ఉంచి మురుగునీటి ప్రదేశాల్లో కర్రకు కట్టి ఉంచనున్నట్లు చెప్పారు. ఈ విధంగా చేయడం వల్ల వర్షం కురిసినా ఆయిల్‌బాల్స్ పాడవకుండా అక్కడే ఉంటాయని, వాటివల్ల లార్వా కొత్తగా ఏర్పడే అవకాశాలుండవని స్పష్టం చేశారు. లార్వా నిరోధక మందును స్ప్రే చేయడం వల్ల వర్షం పడితే ప్రయోజనం తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.పాపారావు, సబ్‌యూనిట్ అధికారి ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిశిఖర గ్రామాల్లోవలంటీర్లే ఉపాధ్యాయులు


బిన్నిడి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెపుతున్న వలంటీర్లు

కొమరాడ: మండలంలోని ఏజెన్సీ గ్రామల్లో ఉపాధ్యాయాలు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గుణదతీలేస్ పంచాయతీ గిరిశిఖర గ్రామం బిన్నడి పాఠశాలలో సుమారు 35 మంది విద్యార్థులు ఉన్నారు. పక్కా భవనం లేకపోవడంతో పాటు ఉపాధ్యాయులు సక్రమంగా రావడం లేదని, దీని వల్ల పిల్లలు చదువుకు దూరమవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయాలు ఉన్నప్పటికీ నెలలో ఒక్కరోజు కూడా రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు తమ సొంత నిధులతో వలంటీర్లను నియమించుకున్నారు. వేలాది రూపాయాలు జీతాలు తీసుకుంటున్న ఉపాధ్యాయాలు తమ గ్రామానికి ఎందుకు రావడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇక్కడే కాకుండా మండలంలోని చాలా గిరిశిఖర గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందని ప్రజా సంఘ నాయకులు చెపుతున్నారు. దీనిపై మండల విద్యాశాఖాధికారి జామి నారాయణస్వామిని వివరణ కోరగా అలా జరగడం లేదని, దీనిపై కచ్చితంగా పర్యవేక్షణ చేస్తామని చెప్పారు.

## రైతుల అవస్థలపై స్పందించాలి


నీరు లేక ఎండిపోతున్న వరి పంటను పరిశీలిస్తున్న రైతు నాయకులు

పాలకొండ రూరల్: ప్రస్తుత కీలక దశలో వరి పంటకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు ఏపీరైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం రైతులతో కలిసి టైలాండ్ గ్రామాల్లో క్షేత్రపర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటపల్లి కాలువల్లో గల ఓపెన్‌హెడ్ ఛానల్స్ పూర్తిగా మరమ్మతులకు గురికావటం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా సకాలంలో పంటకు నీటితడులు అందక రైతులు నష్టపోతున్నారన్నారు. ఎగువ ప్రాంత రైతులు సాగునీటి ప్రవాహానికి అడ్డు కట్టలు వేస్తున్నా యంత్రాంగం స్పందించక పోవటంతో సమస్యలు తలెత్తున్నాయాన్నారు. ముఖ్యంగా ఓపెన్‌హెడ్ ఛానల్స్ అందుబాటులోకి తీసుకురావాలని, పాలకొండ మండల పరిధిలో ఓని గెడ్డకు వంశధార నీటిని, ఛానల్స్‌ను అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు రైతుల తరఫున సంబంధిత అధికారులతో చర్చలు జరపాలని కోరారు.